ఈనాడు
epaper.eenadu.net

మెట్రో రైలు విస్తరణ..

# తిరగనున్న హైదరాబాద్ దశ

ఈనాడు, హైదరాబాద్

మెట్రోరైలు రాకతో ఆయా ప్రాంతాల్లో ప్రజారవాణా మెరుగుపడటం ద్వారా నివాసయోగ్యంగా మారతాయి. అందుబాటు ధరల ఇళ్ల లభ్యత పెరుగుతుంది. ప్రయాణ ఖర్చులు తగ్గి.. ఆర్థిక క్రమశిక్షణతో గృహరుణ చెల్లింపులు కూడా గడువు కంటే ముందే చెల్లిస్తున్నట్లు ఇటీవల ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి నివేదిక వెల్లడించింది. తెలంగాణ ప్రభుత్వం రెండోదశలో 9 కారిడార్లలో విస్తరణకు డీపీఆర్‌లు రూపొందించి కేంద్రం అనుమతి కోసం పంపించింది. మెట్రోరైలు మొదటిదశను సర్కారు స్వాధీనం చేసుకునే ప్రక్రియ పూర్తికాగానే రెండోదశకు అనుమతి ఇవ్వనున్నట్లు కేంద్రం తెలిపింది. మరో రెండు మూడు నెలల్లో అనుమతులు రాగానే మొదట పాతబస్తీలో పనులు ప్రారంభించే అవకాశం ఉంది. ఏకకాలంలో అన్ని కారిడార్లలో నిర్మాణం మొదలు పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇవి మొదలైతే ఆయా ప్రాంతాల్లో రియల్‌ఎస్టేట్ పుంజుకోనుందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**కొత్త ప్రాంతాల్లో 'రియల్' వృద్ధిపై ఆశలు**



నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్, ప్రజల నుంచి వస్తున్న డిమాండ్ దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ప్రాజెక్ట్‌గా మెట్రోరైలు రెండోదశకు రూపకల్పన చేశారు. ఈ దశను ఏ, బి కేటగిరిలుగా విభజించి అన్ని ప్రాంతాలకు సర్కారు ప్రాధాన్యం ఇచ్చింది. పాతబస్తీలో భూసేకరణ ప్రక్రియ చివరిదశలో ఉంది. మిగిలిన కారిడార్లలో భూసేకరణకు అయ్యే రూ.2,787 కోట్ల నిధుల మంజూరుకు రాష్ట్ర మంత్రిమండలి ఈ నెలలో ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే.



## 'ఏ' కేటగిరిలో ఐదు కారిడార్లు

**కారిడార్–4:** నాగోల్-ఆరాంఘర్-శంషాబాద్ విమానాశ్రయం: 36.8 కి.మీ., అంచనా వ్యయం రూ.11,226 కోట్లు

**కారిడార్–5:** రాయదుర్గం-ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్- కోకాపేట నియోపోలీస్: 11.6 కి.మీ., వ్యయం రూ.4,318 కోట్లు

**కారిడార్–6:** ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట: 7.5 కి.మీ., ఖర్చు రూ.2,741 కోట్లు

**కారిడార్–7:** మియాపూర్-పటాన్‌చెరు: 13.4 కి.మీ., వ్యయం రూ.4,107 కోట్లు

**కారిడార్–8** ఎల్బీనగర్-హయత్‌నగర్: 7.1 కి.మీ., ఖర్చు రూ.1,877 కోట్లు

• రెండోదశ 'ఏ'లో 76.4 కి.మీ. మెట్రో విస్తరణకు రూ.24,269 కోట్లు అంచనా అవుతుందని డీపీఆర్‌లో పేర్కొన్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం వాటా 18 శాతం రూ.4,230 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం వాటా రూ.7,313 కోట్లు వ్యయం చేసేలా రూపొందించారు. 48 శాతం రూ.11,693 కోట్లు రుణాల ద్వారా, 4 శాతం రూ.1,033 కోట్లు ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో సమకూర్చుకోవాలనేది ప్రణాళిక. ఈ కారిడార్లు అన్నీ పూర్తైతే 7.96 లక్షల మంది నిత్యం రాకపోకలకు అవకాశం ఉంటుంది.

## 'బి' కేటగిరిలో మూడు...

• ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్‌సిటీకి మెట్రో విస్తరణను 'బి' కేటగిరిలో చేర్చారు.

**కారిడార్–9:** శంషాబాద్ విమానాశ్రయం-ఓఆర్ఆర్- ఫ్యూచర్‌సిటీ వరకు.. 39.6 కి.మీ., అంచనా వ్యయం రూ.7,168 కోట్లు

**కారిడార్–10:** జేబీఎస్- మేడ్చల్ వరకు 24.5 కి.మీ... వ్యయం రూ.6,946 కోట్లు

**కారిడార్–11:** జేబీఎస్-శామీర్‌పేట వరకు 22 కి.మీ., వ్యయం రూ.5,465 కోట్లు

• రెండోదశ 'బి' కేటగిరిలో 86.1 కి.మీ. దూరానికి రూ.19,579 కోట్లు అవుతుందని అంచనా. ఇందులో కేంద్రం వాటా 18 శాతం రూ.3,524 కోట్లు. రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం అంటే రూ.5,874 కోట్లు. రుణాల ద్వారా 48 శాతం రూ.9,398 కోట్లు, పీపీపీలో 4 శాతం రూ.783 కోట్లుగా డీపీఆర్‌లో ప్రతిపాదించారు. పూర్తైతే నిత్యం 6.50 లక్షల మంది రాకపోకలు సాగించవచ్చని అధికారులు తెలిపారు.

• అనుమతులు వచ్చి పనులు మొదలై నిధుల సమస్య లేకపోతే నాలుగైదు ఏళ్లలో ఇవన్నీ కార్యరూపంలోకి వస్తాయి. ఇప్పటికే ఈ ప్రాంతాలు జనావాసాలుగా ఉన్నాయి. మెట్రో అనుసంధానం పెరిగితే మరింతగా అభివృద్ధి చెందుతాయి.

## భూసేకరణ మొదలైంది



''హైదరాబాద్ మెట్రో ప్రారంభ దశలో దేశంలోనే అగ్రగామిగా ఉండేది. ఫేజ్-1 ప్రణాళిక దిల్లీ మెట్రో ఫేజ్-1 కంటే పెద్దదిగా రూపొందించారు. తర్వాత విస్తరణలతో ప్రస్తుతం దిల్లీ మెట్రో 400 కి.మీ. విస్తరించగా.. హైదరాబాద్ మాత్రం 69 కి.మీ. వద్దే నిల్చిపోయింది. రెండో దశ విస్తరణతో హైదరాబాద్ నెట్‌వర్క్ పెరగనుంది. రెండోదశ భూసేకరణ ఇప్పటికే ప్రారంభమైంది. అదనపు కారిడార్లలో భూసేకరణకు కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇక్కడ సైతం ఆస్తుల సేకరణ పనులను ప్రారంభిస్తాం.

– సర్ఫరాజ్ అహ్మద్, ఎండీ, హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు